క్లుప్తంగా

సాయిబాబాకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో సాయిబాబా

బిక్కవోలు: బలభద్రపురంలోని ఆంధ్రా షిర్డీసాయి మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా బాబాకు భక్తులు క్షీరాభిషేకం, పంచామృతాభిషేకం చేశారు. అనంతరం బాబాను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షుడు సబ్బెళ్ల పురుషోత్తమ రెడ్డి పాల్గొన్నారు.

పీఏఐపై అవగాహన అవసరం


సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పంచాయతీ పురోగతి సూచిక (పీఏఐ)పై అధికారులు, ప్రజాప్రతినిధులకు అవగాహన అవసరమని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, సచివాలయం కార్యదర్శులకు పీఏఐపై ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.నరేంద్ర రెడ్డి, రిసోర్సు పర్సన్ ఎస్.కనక నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ప్యూరిఫైర్ వితరణ


పీహెచ్‌సీకి వాటర్ పూరిఫైర్ అందిస్తున్న దాత

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వంగలపూడికి చెందిన గద్దె వెంకటకృష్ణ వాటర్ డిస్పెన్సర్‌ను వితరణ చేశారు. పెండ్యాల రామచంద్రరావు జ్ఞాపకార్థం రూ.11 వేల విలువైన ఈ పరికరాన్ని గురువారం పీహెచ్‌సీ వైద్యుడు ఏవీకే చైతన్యకు అందించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వినాయకుని లడ్డూకు వేలం


లడ్డూను దక్కించుకున్న శ్రీనివాసరావు దంపతులు

సీతానగరం: గణపతి నవరాత్రుల సందర్భంగా దుర్గాభవాని వర్కర్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో సీతానగరం బస్టాండ్ సెంటర్‌లో వినాయక విగ్రహం నెలకొల్పారు. ఈ నేపథ్యంలో స్వామి వారి లడ్డూకు గురువారం వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన యర్రోజు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి రూ.9500కు దాన్ని పాడుకున్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాల్లో లడ్డూ వేలం పాటలు జరిగాయి.

యూరియా నిల్వల పరిశీలన


తోకాడలో యూరియా నిల్వలను పరిశీలిస్తున్న ఆర్డీఓ కృష్ణ నాయక్

రాజానగరం: మండలంలోని తోకాడ సొసైటీలో యూరియా ఎరువు నిల్వలను ఆర్డీఓ ఆర్.కృష్ణనాయక్ గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఇక్కడ 19.62 మెట్రిక్ టన్నుల యూరియా ఉందని, శుక్రవారం వచ్చే యూరియాతో 220 మెట్రిక్ టన్నుల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. దీన్ని రైతులకు పంపిణీ చేయడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

రాజానగరం: మండలంలోని భూపాలపట్నంలో విద్యుత్ సర్వీస్ వైర్‌ను తప్పించే క్రమంలో యువకుడు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. పాత తుంగపాడుకు చెందిన మేడిద పట్టాభిరామ్ (21) తన ఆటోపై పాత తుంగపాడు, భూపాలపట్నం నుంచి పాల క్యాన్లను రాజమహేంద్రవరానికి రవాణా చేస్తుంటాడు. ఈ క్రమంలో గురువారం పాల క్యాన్లు వేసుకుని ఆటోలో రాజమహేంద్రవరం వెళుతున్నాడు. భూపాలపట్నం శివారులో కిందకు వేలాడుతున్న విద్యుత్ సర్వీసు వైరును చేతితో అడ్డు తప్పించేందుకు ప్రయత్నించాడు. ఆ సమయంలో విద్యుత్ షాక్ కొట్టడంతో అక్కడిక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసును రాజానగరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

జంక్షన్.. టెన్షన్


జాతీయ రహదారిలో గాడాల వద్ద ప్రమాదకరంగా ఉన్న కూడలి


విమానాశ్రయం సమీపంలో రోడ్డు పక్కగా పెరిగిన తుప్పలు

- జాతీయ రహదారిపై తరచూ ప్రమాదాలు
- కూడళ్ల వద్ద ఘటనలు
- పలువురి మృత్యువాత

కోరుకొండ: సాధారణంగా జాతీయ రహదారులపై ప్రయాణం చాలా సాఫీగా సాగిపోతుంది. రోడ్లు చక్కగా, విశాలంగా ఉండడంతో వాహనాలు రయ్ మంటూ దూసుకుపోతుంటాయి. అయితే విమానాశ్రయం రోడ్డులో పరిస్థితి దీనికి భిన్నంగా ఉంది. ఇక్కడ తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ రోడ్డులో రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వరకూ సుమారు 12 ప్రమాదకర కూడళ్లు ఉన్నాయి. వాహనాలు వేగంగా రావడం, అదే సమయంలో రోడ్డును ప్రజలు దాటుతుండడంతో ఈ కూడళ్ల వద్ద ప్రమాద ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి.

గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి

విమానాశ్రయం రోడ్డును జాతీయ రహదారి 516 ఈ అనే పేరుతో పిలుస్తారు. రాష్ట్రీయ రహదారిగా ఉన్న దీన్ని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జాతీయ రహదారిగా తీర్చిదిద్దింది. ఇది రాజమహేంద్రవరంలోని శానిటోరియం ప్రాంతం నుంచి ప్రారంభమై, ఏజెన్సీ మీదుగా విజయ నగరం వరకూ వెళ్లిపోతుంది. ఈ నేపథ్యంలో వాహనాల రాకపోకలు ఎక్కువగా జరుగుతాయి. ఇదే సమయంలో రాజమహేంద్రవరం నుంచి కోరుకొండ వరకూ ఉన్న రోడ్డులోని జంక్షన్లలో ప్రమాదాలు జరుగుతున్నాయి.

ప్రమాదాలకు నిలయం

రాజమహేంద్రవరం నుంచి మధురపూడిలోని విమానాశ్రయం వరకూ 11.2 కిలోమీటర్ల మేర రోడ్డు ఉంది. దాదాపు ఏడాదిలో ఈ ప్రాంతంలో సుమారు 16 ప్రమాదాలు జరిగాయి. రాజమహేంద్రవరం రూరల్ మండలం కొంతమూరు, కోలమూరు, శానిటోరియం ప్రాంతాల్లో జరిగిన ఆరు ఘటనల్లో ముగ్గురు మృతి చెందారు. అలాగే కోరుకొండ మండలం గాడాల సెంటర్, గాడాల – నిడిగట్ల, మధురపూడి ఆంజనేయస్వామి ఆలయం సెంటర్, బూరుగుపూడి – గుమ్ములూరు, బూరుగుపూడి జంక్షన్, కాపవరం – ముగ్గళ్ల, కోరుకొండ – జంబూపట్నం కూడళ్లలో పది ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిలో ఆరుగురు కన్నుమూశారు. మరో ఆరుగురు క్షతగాత్రులయ్యారు.

> **ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి**
>
> 
>
> జాతీయ రహదారి 516ఈ నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. దీనికి ఇరువైపులా పెరిగిన మొక్కలు, డివైడర్ మధ్యలోని పిచ్చి తుప్పలను తొలగించాలి. ప్రమాదాలు జరుగుతున్న కూడళ్లలో రక్షణ చర్యలు తీసుకోవాలి.
>
> – నక్కా రాంబాబు, మాజీ ఏఎంసీ చైర్మన్, గుమ్ములూరు సర్పంచ్

నిర్వహణ లోపం

ఈ జాతీయ రహదారిని సుమారు రూ.40 కోట్లతో నిర్మించారు. వాహనాల రాకపోకలకు ఎంతో అనువుగా తీర్చిదిద్దారు. అయితే కొన్ని ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు ఏపుగా పెరిగిపోయాయి. వాటిని తొలగించడంపై రహదారి భద్రతా విభాగం, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. నిర్వహణ లోపంతో మొక్కలు పెరిగిపోవడంతో రహదారి మూసుకుపోతోంది. వాటి వల్ల కూడా ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

సస్యరక్షణ చర్యలతో దిగుబడులు


మిత్ర పురుగుల సంరక్షణపై అవగాహన కల్పిస్తున్న ఏఓ సత్య ప్రసాద్

పెదపూడి: పంట సాగుతో పాటు సకాలంలో అవసరమైన సస్యరక్షణ చర్యలు చేపడితే నాణ్యమైన, అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయశాఖ మండలాధికారి ఎస్.సత్యప్రసాద్ తెలిపారు. పెదపూడి గ్రామంలో గురువారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వరి పొలాలను పరిశీలించారు. పంటకు మేలు చేసే మిత్ర పురుగుల గుర్తింపు, వాటిని సంరక్షించుకునే విధానాలను రైతులకు వివరించారు. అలాగే శత్రు పురుగులను ఏ విధంగా నాశనం చేయాలో తెలిపారు. ఈ నెల 15వ తేదీలోపు ఈ – పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో విస్తరణ అధికారి శ్రీనివాసు గౌడ్, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు కాకర సాయిబాబు, పరిమి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశించిన రేవుల్లోనే నిమజ్జనాలు చేయాలి


సంపరలో కాలువ రేవును పరిశీలిస్తున్న అధికారులు

పెదపూడి: వినాయక ఉత్సవాల్లో భాగంగా చేపట్టే నిమజ్జనాలను నిర్దేశించిన పంట కాలువల రేవుల్లోనే నిర్వహించాలని ఎంపీడీఓ కె.నరేంద్రరెడ్డి, తహసీల్దార్ పీవీ సీతాపతిరావు అన్నారు. ఈ మేరకు డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి తదితరులు శహపురంలోని ఆడదాని రేవు, ఏపీత్రయంలోని పశ్చిమ ఏలేరు కాలువ, జి.మామిడాడలోని తుల్యభాగ నదీపాయ కాలువ, కాండ్రేగులు, చింతపల్లి గ్రామాల్లోని మూడు ప్రదేశాలు, సంపర శివారు ముక్తేశ్వరంలోని పంటకాలువ రేవులను గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ ఈ రేవుల వద్ద వీఆర్వోలు, సచివాలయం సిబ్బంది, పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. అవసరమైన రేవుల్లో లైటింగ్, కొన్ని రేవుల్లో బారికేడ్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు.

అన్నసమారాధన

బిక్కవోలు: గణపతి నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా పందలపాకలోని రెడ్ల రామాలయం వద్ద గురువారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారి ప్రసాదం స్వీకరించారు.

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక


పవన్‌కుమార్ (వెలుగుబంద)


యువరాజారెడ్డి (పందలపాక)


శారదా జ్యోతి (ఇలపల్లి)


బి: రసూల్ షరీఫ్ (మోళ్లూరు)


రామారెడ్డి (తుమ్మలపల్లి)


సీతామహాలక్ష్మి (పులగుర్త)


ఉల్లి రామకృష్ణ (బొబ్బిల్లంక)


పల్లయ్య గుప్తా (రఘుదేవపురం)

రాజానగరం/బిక్కవోలు/అనపర్తి/సీతానగరం: రాజానగరం, అనపర్తి నియోజకవర్గాలకు చెందిన పలువురు ఉపాధ్యాయులు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా శుక్రవారం రాజమహేంద్రవరంలో వీరందరూ అవార్డులు అందుకోనున్నారు. రాజానగరం మండలం వెలుగుబంద ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు భాస్కెట్ పవన్‌కుమార్, బిక్కవోలు మండలం పందలపాకలోని పడాల పెద్ద పుల్లారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీడీ దార్వపూడి యువరాజారెడ్డి, ఇలపల్లి ఉన్నత పాఠశాలకు చెందని ఎం.శారదా జ్యోతి, మోళ్లూరు ఉన్నత పాఠశాల చెందిన మహ్మద్‌తాలిబ్ రసూల్ షరీఫ్, తుమ్మలపల్లి ఎంపీపీఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్ఎస్‌వీ రామారెడ్డి, అనపర్తి మండలం పులగుర్త ఆర్ఐవీఎం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని కె.సీతామహాలక్ష్మిలు అవార్డులు అందుకోనున్నారు. అలాగే సీతానగరం మండలం బొబ్బిల్లంక హైస్కూల్‌కు చెందిన ఉల్లి రామకృష్ణ, అదే గ్రామంలోని ఎంపీపీ స్కూల్ టీచర్ ఎ.మేరీ కుమారి, రఘుదేవపురం ఎంపీపీఎస్‌కు చెందిన జీవీ పల్లయ్య గుప్తా, మిర్తిపాడు హైస్కూల్‌కు చెందిన ఆర్.సూరిబాబు, సింగవరం పాఠశాలకు చెందిన జీవీవీ దుర్గాప్రసాదరావు ఎంపికయ్యారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా..


ఉమా మహేశ్వరీదేవి

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్ అండ్ మేనేజ్మెంట్ స్టడీస్ అధ్యాపకురాలు ప్రొఫెసర్ పి.ఉమా మహేశ్వరీదేవి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఈ విషయాన్ని వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ గురువారం తెలిపారు.

భక్తిశ్రద్ధలతో గణేశ్ విగ్రహాల నిమజ్జనం


చంద్రేడులో వినాయక విగ్రహం ఊరేగింపు


మునికూడలిలో నిమజ్జనం కోసం విగ్రహాలను పడవ పైకి ఎక్కిస్తున్న భక్తులు

రంగంపేట: గణపతి బప్పా మోరియా.. గణేశ్ మహరాజ్‌కు జై అనే నినాదాలు గురువారం మండలంలో మార్మోగాయి. రంగంపేట, చంద్రేడు, పెదరాయవరం తదితర గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో నెలకొల్పిన గణనాథుల విగ్రహాల నిమజ్జనను ఆయా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అట్టహాసంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆయా గ్రామాల్లో వైభవంగా ఊరేగింపులు జరిపారు. కొన్ని విగ్రహాలను స్థానిక చెరువుల్లో, మరి కొన్నింటిని రాజమహేంద్రవరంలోని గోదావరిలో నిమజ్జనం చేశారు. అంతకు ముందు ఆయా మండపాల వద్ద లడ్డూ వేలాన్ని కోలాహలంగా నిర్వహించారు.

సీతానగరం మండలంలో..

సీతానగరం: మండలంలో వినాయక విగ్రహాలను నిమజ్జనోత్సవం ఘనంగా జరిగింది. పురుషోత్తపట్నం, రామచంద్రపురం, వంగలపూడి, మునికూడలి రేవుల్లో నిమజ్జనాలు నిర్వహించారు. గోదావరి ఉధృతంగా ఉండడంతో ఘాట్ల వద్ద ఎస్సై డి.రామ్ కుమార్, సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

బిక్కవోలు మండలంలో..

బిక్కవోలు: ఊలపల్లి బొబ్బలి వీధిలో కొలువైన వరసిద్ధి వినాయక స్వామికి ముందుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నసమారాధన అనంతరం భారీ ఎత్తున ఊరేగింపు నిర్వహించి, కాలువలో నిమజ్జనం చేశారు. అలాగే ఆర్ఎస్ పేటలో నిమజ్జనాలు ఘనంగా జరిగాయి. కొంకుదురులోని మంచినీటి చెరువు వద్ద గరిక పూజ చేశారు.

జీఎస్ఎల్‌లో ముగిసిన బేసిక్ శిక్షణ


మెడికోకు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం: ఉజ్బెకిస్తాన్‌లో వైద్య విద్యను అభ్యసిస్తున్న 60 మంది భారతీయ విద్యార్థులకు స్థానిక జీఎస్ఎల్ వైద్య కళాశాలలో నాలెడ్జ్ షేరింగ్‌లో భాగంగా సిమ్యులేషన్ ద్వారా 10 రోజుల పాటు నిర్వహించిన బేసిక్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఇంత వరకు నాలుగు బ్యాచ్‌లలో 240 మందికి శిక్షణ ఇచ్చారని జీఎస్ఎల్ ఇంటర్నేషనల్ ఎఫైర్స్ అధికారి డాక్టర్ గోవిందరాజులు తెలిపారు. విదేశాలలో వైద్య విద్యను అభ్యసించే భారతీయ విద్యార్థులు స్వదేశానికి వచ్చిన తరువాత నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) పరీక్షలో ఉత్తీర్ణులైతేనే మెడికల్ ప్రాక్టీసుకు అర్హత పొందుతారన్నారు. ఈ సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకుని ఉజ్బెకిస్తాన్‌కి వెళ్తున్న విద్యార్థులకు ధ్రువీకరణ పత్రాలను జీఎస్ఎల్ వైద్య కళాశాల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు అందజేశారు.

విజయ గణపతికి పూజలు


అనపర్తిలో విజయ గణపతి

అనపర్తి: గ్రామంలోని పాత ఊరిలో గల బాపనమ్మ ఆలయ ఆవరణలోని విజయ గణపతిని దర్శించుకోవడానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసిన అన్న సమారాధనలో అన్న ప్రసాదం స్వీకరించారు.

రోడ్డు నిర్మించండి సారూ..

కోరుకొండ: శ్రీరంగపట్నం నుంచి గరగలంపాలెం వెళ్లే రోడ్డు నిర్మిస్తానని ఇచ్చిన హామీని నెరవేర్చాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణను స్థానికులు కోరారు. ఆ గ్రామంలో గురువారం జరిగిన మన ఊరు – మన ఎమ్మెల్యే కార్యక్రమానికి వచ్చిన ఎమ్మెల్యేను కోరారు. రాత్రి వేళల్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ రోడ్డు మీదుగా కంకర, గ్రావెల్‌ను తరలించే భారీ లారీలు నడపడంతో గోతులమయంగా మారిందన్నారు. త్వరితగతిన రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు.

సాయి సచ్చరిత్ర పారాయణ

రాజానగరం: స్థానిక షిరిడీ సాయిబాబా మందిరంలో గురువారం సాయి సచ్చరిత్ర పారాయణ వైభవంగా జరిగింది. సాయి భక్తమండలి ఆధ్వర్యంలో ఉదయం 6 గంటలకు ప్రారంభమైన పారాయణ మధ్యాహ్నం 4 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. గురు పౌర్ణమి నుంచి ప్రారంభించిన 11 గురువారాల గురు చరిత్ర పారాయణలో భాగంగా 9వ వారం సాయి సచ్చరిత్రను పారాయణ చేశారు.

ఏపీ నాటక అకాడమీ డైరెక్టర్‌గా రమణ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రాజమహేంద్రవరం ఆర్ట్స్ క్రియేటివ్ కల్చరల్ అసోసియేషన్ (రాకా) కార్యదర్శి జీవీ రమణ ఆంధ్రప్రదేశ్ నాటక అకాడెమీ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు 25 మందితో పాలక వర్గ జాబితాను ప్రభుత్వం ప్రకటించింది. ఈ సందర్భంగా గోకవరం బస్టాండ్ సమీపంలోని బాలు స్మారక మందిరంలో గురువారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీ రమణ మాట్లాడారు. ఇరిగేషన్ శాఖలో ఉద్యోగిగా పనిచేస్తూ, రాజమహేంద్రవరంలో కూడా విధులు నిర్వర్తించి, ఇక్కడే స్థిరపడ్డానన్నారు. రాకా సంస్థ స్థాపనలో కీలక పాత్ర పోషించి కార్యదర్శిగా వ్యవహరిస్తూ, పలు సాంస్కృతిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. నాటక అకాడమీ తరపున చేయాల్సిన కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేస్తానని తెలిపారు. కాగా.. రమణను రాకా సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కంటే వీరన్న చౌదరి, ఉపాధ్యక్షుడు తిరుమల కృష్ణమోహన్, కోశాధికారి సూరపరెడ్డి తాతారావు, సభ్యులు భమిడిపాటి రామకృష్ణమూర్తి తదితరులు అభినందించారు.

వ్యక్తి అదృశ్యం

రాజమహేంద్రవరం రూరల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న తన భర్త ఇంటి నుంచి చెప్పకుండా వెళ్లిపోయారని రాజమహేంద్రవరం ఎస్‌వీజీ మార్కెట్‌కు చెందిన కరక భవాని గురువారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌వీజీ మార్కెట్ యశోద టవర్స్‌లో నివసిస్తున్న 51 ఏళ్ల కరక సత్యప్రసాద్ ఈ నెల ఒకటిన ఇంటి నుంచి బయటకు వెళ్లారు. అప్పటి నుంచి తిరిగి రాలేదు. ఈ మేరకు ఆయన భార్య భవాని.. పోలీసులకు ఫిర్యాదు చేశారు. బొమ్మూరు ఎస్సై సీహెచ్‌వీ రమేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సత్యప్రసాద్ సమాచారం తెలిసిన వారు 94407 96533(సీఐ), 94911 22811 (ఎస్సై) నంబర్లకు తెలియజేయాలని కోరారు.

సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర కీలకం


మాట్లాడుతున్న జీజీయూ ప్రొ.చాన్సలర్ శశికిరణ్‌వర్మ

- జీజీయూ ప్రొ.చాన్సలర్ శశికిరణ్ వర్మ
- అధ్యాపకులకు సన్మానం

రాజానగరం: ఆదర్శ సమాజ నిర్మాణంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని గోదావరి గ్లోబల్ యూనివర్సిటీ (జీజీయూ) ప్రొ.చాన్సలర్ కె.శశికిరణ్‌వర్మ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం యూనివర్సిటీలో ముందస్తు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు. వీసీ డాక్టర్ యు.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తికి వన్నె తెచ్చిన మహోన్నత మూర్తి డాక్టర్ సర్వేపల్లి అన్నారు. అధ్యాపకులకు నగదు బహుమతులు, క్రీడల్లో పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.


సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

సమాజ నిర్దేశకులు

సీతానగరం: ఉపాధ్యాయులు సమాజ నిర్దేశకులు అని సీతానగరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి.చిట్టిబాబు అన్నారు. ఆ కళాశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. అనంతరం ప్రిన్సిపాల్, అధ్యాపకులను విద్యార్థులు సత్కరించారు.

విజ్ఞాన జ్యోతులు


రంగంపేటలో ఉపాధ్యాయిని రమ్యసుధకు అవార్డు ప్రదానం చేస్తున్న హెచ్ఎం పార్థసారథి

రంగంపేట: అజ్ఞాన చీకట్లను తొలగించి, విజ్ఞాన జ్యోతులు వెలిగించే ఉపాధ్యాయులను గౌరవించాలని మండల విద్యాశాఖ అధికారి కె.శ్రీనివాసరావు సూచించారు. రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వి.పార్థసారథి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, ఉపాధ్యాయ సంఘ నేత దివంగత లోలభట్టు చిన్నంరాజు స్మారక అవార్డును జీవశాస్త్ర ఉపాధ్యాయిని వినుకొండ రమ్యసుధకు ఎంఈవో శ్రీనివాసరావు, హెచ్ఎం వి.పార్థసారథి, సత్యసాయి సేవాసంస్థ రంగంపేట సబ్ జోన్ కన్వీనర్ మల్లిరెడ్డి వీర్రాజు, సీఆర్ఎంటీ ఎల్.శ్రీనివాసరాజు ప్రదానం చేశారు. మరో ఉపాధ్యాయ సంఘం నేత దివంగత టీజీ వాషింగ్టన్ మాస్టారు స్మారక అవార్డును పీడీ కె.శైలకు అందించారు. ఉపాధ్యాయుల వేషధారణలో విద్యార్థుల అనుకరణ విశేషంగా ఆకట్టుకుంది. మండలంలోని పలు పాఠశాలల్లో ఆయా ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు.